క్లుప్తంగా

వేడుకగా శ్రీవారి కల్యాణం

రాపూరు : మండలంలోని పెంచలకోన పెను శిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువలా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. తదుపరి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేపట్టారు.

నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన

నాయుడుపేట టౌన్ : అధిక దిగుబడి సాధించేలా నూతన వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని నెల్లూరు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శివనారాయణ రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. నాయుడుపేటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం నాయుడుపేట, సూళ్లూరుపేట గూడూరు డివిజన్లలోని సిబ్బందికి పంట పొలాల సామర్థ్యం పెంపుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త వినీత, ఏడీఏ ప్రసాద్ పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రాఘవయ్య

కోట : మండలంలోని గమళ్లపాళెంకు చెందిన విద్యార్థిని సాయిఅంజలికి కోట మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోట రాఘవయ్య శనివారం రూ.22 వేల ఆర్థిక సాయం అందించారు. ఆమె ప్రస్తుతం బీటెక్ సెకండియర్ చదువుతోంది. కళాశాల ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న రాఘవయ్య కుమారుడు కళ్యాణ్‌రామ్ ముందుకు వచ్చి రూ.22 వేలు అందజేశారు.

వేడుకగా పోలేరమ్మ గ్రామపొంగళ్లు

కోట: మండలంలోని చిట్టేడులో పోలేరమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. రెండో రోజు శనివారం కలశ ప్రతిష్ట, గంగపెట్టి ఊరేగింపు, గ్రామ పొంగళ్లు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కమిటీ ఏర్పాటు

కోట : మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నూతన కమిటీని ఏర్పాటుచేసినట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. కోటలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ సలహాదారుగా మర్రి పోలయ్య, అధ్యక్షుడిగా పేర్నేటి కిరణ్ ఎంపికయ్యారు. గుంటూరులో జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మీజూరు మాధవ్, డాక్టర్ రామక్రిష్టారావు, దాసరి సుందరం, హేమంత్, వసంత్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

బాలాయపల్లి(సైదాపురం) : అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆయన శనివారం నిండలి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం చేపట్టేవారు సచివాలయంలో వివరాలు నమోదు చేయించి రసీదు తీసుకోవాలన్నారు.

మంగళ సూత్రం అందజేత

వాకాడు : స్థానిక కోదండరామ స్వామి ఆలయంలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్థికంగా వెనుకబడిన నవ వధువుకు సీతారామ ధార్మిక సేవా సంస్థ ప్రతినిధులు మంగళ సూత్రం, చీర, సారె అందజేశారు. వీటిని ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధు కిరణ్‌రెడ్డి దంపతులు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నేత కొడవలూరు దామోదర్‌రెడ్డి, యుగంధర్‌స్వామి, శ్రీనివాసచక్రవర్తి, కళ్యాణకృష్ణ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

పెళ్లకూరు: మండలంలోని ఒక గిరిజన కాలనీకి చెందిన వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన చంద్రయ్య, వెంకటేశ్వర్లుపై అట్రాసిటీ నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ చిల్లకూరు వడ్డిపాళెంకు చెందిన చంద్రయ్య, వెంకటేశ్వర్లు శుక్రవారం సమీప గిరిజన కాలనీకి వెళ్లి మద్యం సేవించారు. ఆ సమయంలో ఒంటరిగా ఉన్న మహిళతో అసభ్యంగా ప్రవర్తించారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు గిరిజన కాలనీకి చేరుకుని విచారించారు. అనంతరం అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

వెంకటగిరి(సైదాపురం) : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 14వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జడ్జి అనూష తెలిపారు. ఆమె శనివారం న్యాయవాదులతో సమీక్షించారు. వివాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి, ఎక్కువ కేసులు రాజీ చేసుకునేలా చొరవ తీసుకోవాలన్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

అధికారం అండతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రీపగలు తేగా లేకుండా స్వర్ణముఖిని చెరబట్టి ఇసుకను తోడేస్తున్నారు. నది పొర్లు కట్టలను ధ్వంసం చేసి రోడ్డును ఏర్పాటుచేసుకున్నారు. బ్రిడ్జీల సమీపంలో సైతం ఇసుకను తోడేయడంతో పిల్లర్లు దెబ్బతింటున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- స్వర్ణముఖి నదిని తోడేస్తున్న అక్రమార్కులు
- రాత్రి, పగలు తేడా లేకుండా తరలింపు
- అధికార పార్టీ నేతల అండతో చేలరేగిపోతున్న వైనం



తుమ్మూరు బ్రిడ్జి సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న అక్రమార్కులు

నాయుడుపేట టౌన్ : స్వర్ణముఖి నది నాయుడుపేటతో పాటు చుట్టు పక్కల మండలాలకు సాగు, తాగునీటికి ప్రధాన వనరు. ఈ నదిలో నాణ్యమైన ఇసుక ఉంది. దీనికి చెన్నైలో మంచి డిమాండ్ ఉంది. అక్కడ లారీ ఇసుక సుమారు రూ.లక్ష వరకు ధర పలుకుతోంది. నవంబర్, డిసెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు నదిలో పెద్ద ఎత్తున ఇసుక వచ్చి చేరింది. దీనిపై అక్రమార్కులు కన్ను పడింది. దీనికితోడు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నదిలోకి వెళ్లేందుకు పొర్లుకట్టను సైతం తెగ్గొట్టి రోడ్డు ఏర్పాటుచేసుకున్నారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరు స్వర్ణముఖి నది వద్ద రెండు బ్రిడ్జిల సమీపంలో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక తవ్వేస్తున్నారు. పగలు ట్రాక్టర్లలో ఇసుకను డంపింగ్ యార్డులకు తరలించి రాత్రిళ్లు లారీల్లో చెన్నైకి తరలిస్తున్నారు. స్వర్ణముఖి నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జి పిల్లర్ల సమీపంలో భారీగా ఇసుకను తవ్వేయడంతో ప్రమాదకరంగా మారాయి. రైళ్లు వెళ్లే సమయంలో కుదుపులు ఏర్పడుతున్నాయి. దీనిపై రైల్వే అధికారులు పలుమార్లు సంబంధింత శాఖ అధికారులు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. నాయుడుపేట మండలంలోని భీమవరం, చిగురుపాడు, అయ్యప్పరెడ్డిపాళెం, కల్లిపేడు, మూర్తిరెడ్డి పాళెం, మర్లపల్లి, తదితర ప్రాంతాల్లో స్వర్ణముఖి నది నుంచి రాత్రీ పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఇక్కడి రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకుని ట్రాక్టర్లను వదిలేస్తున్నారని, ఎప్పుడైనా ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినప్పుడు మామూళ్లు ఇవ్వని ట్రాక్టర్లను పట్టుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రైల్వే బ్రిడ్జి సమీపంలో ట్రాక్టర్లలో ఇసుకను లోడు చేస్తున్న కూలీలు

ఇష్టారాజ్యంగా తవ్వకాలు



స్వర్ణముఖి నదిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టారు. పట్టణ పరిధిలోని తుమ్మూరుతో పాటు పలుచోట్ల నదిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పిల్లలు నదిలోకి ఆడుకునేందుకు వెళుతుంటారు. ఆ గుంతల్లో మునిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అధికారులు నది వద్ద సూచిక బోర్డులు పెట్టాలి. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చదలవాడ కుమార్, న్యాయవాది, నాయుడుపేట

కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి



స్వర్ణముఖి నది నుంచి ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. పగలు, రాత్రీ తేడా లేకుండా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకుని చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటుతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

– చిందేటి వెంకటేశ్వర్లు, బీసీ నాయకుడు, నాయుడుపేట

ఘనంగా అఖండ కర్పూర జ్యోతి దర్శనం



అరటి బోదెలతో తయారు చేసిన అయ్యప్పస్వామి ఆలయం వద్ద నాయకుల పూజలు



అయ్యప్పస్వామి అఖండ కర్పూర జ్యోతి కాంతులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని గాంధీ పార్కు సమీపంలో శనివారం రాత్రి 43వ అఖండ జ్యోతి పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కర్పూర కాంతుల్లో అయ్యప్ప స్వామిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం గణపతి హోమం చేశారు. అనంతరం కలశ ఊరేగింపు చేపట్టారు. రాత్రి అఖండ కర్పూర జ్యోతి పూజోత్సవం నిర్వహించారు. కోటకొండ గజేంద్ర స్వామి తదితర గురుస్వాములు ఒక్కో మెట్టుకు భక్తిశ్రద్ధలతో పూజ లు చేస్తూ 18 మెట్లకు వద్ద కర్పూర జ్యోతులు వెలిగించారు. తారకప్రభు భక్త బృందం గురుస్వాములు సేకరించిన దాదాపు 400 కేజీలకు పైగా కర్పూరాన్ని వెలిగించారు. ఇందులో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మహిళలు దీపాలు చేతబట్టి అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి స్వాగతం పలికారు. నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భగవాన్ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, జలదంకి వెంకట కృష్ణారెడ్డి, కనమర్లపూడి సుబ్రమణి, కలికి మాధవరెడ్డి, పాపాడి చంద్రారెడ్డి, చిరువేళ్ల మునిరాజ, దేవత చెంచు కిషోర్ శెట్టి, మదిరి జలందర్, సంజయ్‌కుమార్, డీసీ యతీంద్ర, గిండిరాజశేఖర్, అంకయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా సుబ్రమణ్యస్వామి కల్యాణం

సూళ్లూరుపేట : పట్టణంలోని గంగా పార్వతి త్రినేత్ర నాగేశ్వరస్వామి ఆలయంలో శనివారం సుబ్రమణ్య స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యస్వామిరెడ్డి దంపతుల చేతుల మీదు గా వేద పండితులు గణపతి పూజ చేయించారు. అనంతరం బాషికాలకు పూజలు చేసి అమ్మ, స్వామి వార్లకు అలంకరించారు. నూతన వస్త్రాలను సమర్పించి జీలకర్ర, బెల్లం సంప్రదాయబద్ధంగా వివాహాన్ని జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సచివాలయం తనిఖీ



కొమ్మిపాడు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న వసుమతి

సైదాపురం : మండలంలోని కొమ్మిపాడు గ్రామ స చి వాలయాన్ని శనివారం డివిజన్ అభివృద్ధి అధికా రి వసుమతి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆ దేశించారు. అనంతరం ఊటుకూరు ఉన్నత పాఠ శాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు చేశా రు. కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు

చిట్టమూరు (చిల్లకూరు) : మండలంలోని మల్లాంలో ఉన్న సుబ్రమణేశ్వరస్వామి ఆలయంలో సుబ్రమణ్య షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా చెన్నై నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

రెవెన్యూ సదస్సుకు అర్జీల వెల్లువ



దొరవారిసత్రం : అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలకుమారి



ఓజిలి: వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పద్మావతి

దొరవారిసత్రం : వేణుంబాకంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు అర్జీలు వెల్లువెత్తాయి. పాస్ పుస్తకాలు, భూములకు పట్టాలు, ఇంటి స్థలాల మంజూరు, సర్వే తదితర సమస్యలపై వినతులు వచ్చినట్టు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. సర్వేయర్ నాగరాజు, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ సయ్యద్ మస్తాన్, షబ్బీర్, మౌలా, మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని కురుగొండలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు వివిధ సమస్యలపై 20 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ఆర్‌ఐ విజయ్‌కుమార్, వీఆర్వో మస్తానయ్య, సర్వేయర్లు లక్ష్మీనారాయణ, నాగూర్‌బాషా పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి : మండలంలోని చెన్న సముద్రంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 39 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి నాగార్జునసాగర్ పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

కోటలో..

కోట: మండలంలోని గూడలిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 మంది భూసమస్యలపై అర్జీలు ఇచ్చినట్టు తహసీల్దార్ జయజయరావు తెలిపారు. డీటీ అజంతుల్లాఖాన్, ఆర్‌ఐ మధులత పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు : మండలంలోని పీసీటీకండ్రిగలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు రైతులు లేక బోసిపోయింది. తొమ్మిది మంది రైతులు మాత్రమే పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నెరవేర్చే పరిస్థితి లేకపోవడమే రైతులు గైర్హాజరవుతున్నట్లు సమాచారం. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్‌ఐ సంతోషిణిబాయి, వీఆర్వో కళ్యాణి పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు మండలంలోని బూదనంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన

గూడూరు రూరల్ : గూడూరులోని కోర్టు హాల్‌లో శనివారం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లోకనాథం మాట్లాడుతూ సెక్షన్ 89 ప్రకారం మధ్యవర్తిత్వం చేసుకోవచ్చన్నారు. తద్వారా త్వరగా కేసు పరిష్కారమవుతుందని వివరించారు. దీన్ని పార్టీలు పూర్తిగా మరిచి పోవడం వల్ల అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ క్రమంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కే కొండలరావు, అరవపార్వతయ్య, సుమన్, వెంకటసుబ్బయ్య, వంశీ, సుమన్, ఎస్ వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది, నయోమి పాల్గొన్నారు.

మకర తోరణం వితరణ



మకరతోరణాన్ని తీసుకువస్తున్న భక్తులు

చిల్లకూరు : బల్లవోలులోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామికి శనివారం నాయుడుపేటకు చెందిన పేట మురళీరెడ్డి, పద్మమ్మ, పవన్, దివ్య వెండి తొడుగులు, మకర తోరణం వితరణ చేశారు. వాటి విలువ రూ.80 వేలు ఉంటుందని అర్చకులు తెలిపారు. మారంరెడ్డి అమరనాథ్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, చెంచుకిరణ్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

చిల్లకూరు : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం గూడూరు రెండవ పట్టణంలోని నరసింగారావుపేటలో ఏర్పాటుచేసిన సిద్దార్థ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆరంభించారు. ఆయన మాట్లాడుతూ ధనవంతులకే కాకుండా పేదలకు కూడా తక్కువ ఫీజుతో వైద్యం అందించాలని కోరారు. పట్టణ ప్రజలు చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే మెరుగైన వైద్యం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో లెమన్ మర్చంట్ తలమంచి సిద్దారెడ్డి, ప్రముఖ వైద్యులు జనార్ధనరెడ్డి, రోహిణి, ప్రముఖ పారిశ్రామిక వేత్త చదలవాడ హరిప్రసాద్, బ్యాంక్ ఆఫ్ బరోడా తిరుపతి రీజియన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అమరనాథ్‌రెడ్డి, ఆస్పత్రి వైద్యులు తలమంచి వినోద్‌కుమార్‌రెడ్డి, దువ్వూరు లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.

ఎవరికీ భారం కాకూడదని..

నదిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

నాయుడుపేటటౌన్: నాయుడుపేటలో శనివారం రాత్రి వృద్ధురాలు స్వర్ణముఖి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తుమ్మూరుకు చెందిన లోడారి రామమ్మ ఒంటరిగా ఉంటోంది. అనారోగ్యంతో బాధపడుతోంది. పట్టణంలో ఉన్న మనవరాలు ఆమె బాగోగులు చూసుకోనేది. శుక్రవారం నాయుడుపేటలోని మనుమరాలు ఇంటికి వచ్చింది. మనుమరాలు లేకపోవడంతో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న శివాలయానికి వచ్చేసింది. ఎవరికీ భారం కాకూడదని భావించి రాత్రి కాజ్‌వే నుంచి నదిలోకి దూకేసింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచా రం అందించారు. సీఐ బాబి, అగ్నిమాపక శాఖ అధికారి శ్యామ్ బాబు నదిలో గాలింపు చర్యలు చేపట్టి శనివారం మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలి కుమార్తె మహాలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హడావుడి.. ఆర్భాటం..

ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమ్మేళనాన్ని చేపట్టారు. హడావుడి.. ఆర్భాటం కనిపించింది. కొన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు అనుకున్న మేరకు రాలేదు. పిల్లల సంఖ్య ఎందుకు తగ్గుతుందో చెప్పాలని టీచర్లను నిలదీశారు. అధికారులు మాట్లాడుతూ పిల్లలకు మెరుగైన విద్యా బోధన చేయాలని, పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లల చదువులపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారో తెలుసుకోవాలన్నారు. ఇళ్ల వద్ద వారితో చదివించాలని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దొరవారిసత్రం : మాట్లాడుతున్న సివిల్ జడ్జి అనీల్‌కుమార్



దక్కిలి: బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి



కలువాయి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాత సూర్యనారాయణ

- సైదాపురం మండలంలోని దాడిశెట్టిపల్లి పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పురుషోత్తంశివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. అలాగే చాగణం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మస్తానమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు దయాకర్, సుప్రియ పాల్గొన్నారు.
- ఓజిలి మండలంలోని రాచపాళెం ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం హరికిశోర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతి నెలా పాఠశాలకు వచ్చి తమ పిల్లలు ఎలా చదువుతున్నారనే విషయాలు తెలుసుకోవాలన్నారు. సర్పంచ్ శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.
- దొరవారిసత్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, మావిళ్లపాడు ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సూళ్లూరుపేట కోర్టు సివిల్ జడ్జి అనీల్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి బాటలో నడవాలని తెలిపారు. తల్లిదండ్రులు కొంత సమయం కేటాయించి పిల్లలతో మాట్లాడాలని, ఎలా చదువుతున్నారనే విషయాలు తెలుసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ప్రత్యేక అధికారి జ్యోతిర్మయి, కోట తహసీల్దార్ జయజయరావు, ప్రిన్సిపాల్ సుమలత తదితరులు పాల్గొన్నారు.
- దక్కిలి మండలంలోని 71 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి కందలవారపల్లి, దక్కిలి, దేవునివెల్లంపల్లి, వెంకటేశ్వరపురం, సంగనపల్లి పాఠశాలలను సందర్శించారు. తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఎంఈవోలు వెంకటేశ్వర్లు,పీ జగదీష్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి, వైస్ ప్రిన్సిపాల్ ప్రభావతి పాల్గొన్నారు.
- రాపూరు మండలం గోనుపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఎంఈవో శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుడప్పుడూ పాఠశాలకు వస్తూ ఉండాలన్నారు. అప్పుడే పిల్లలు ఎలా చదువుతున్నారనే విషయం తెలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్‌ఎం నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.
- కోట మండలంలో పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గడంపై తల్లిదండ్రులు టీచర్లను నిలదీశారు. అభివృద్ధి పనులు ఎందుకు ఆగిపోయాయని పేర్కొన్నారు.
- సూళ్లూరుపేట రూరల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమ్మేళనం నిర్వహించారు. మంగళంపాడు, దామానెల్లూరు, కోటపోలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, ఎంఈవో శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.
- వెంకటగిరి పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. తల్లిదండ్రులు పిల్లలు ఎలా చదువుతున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, సీఐ ఏవీరమణ, విశ్రాంత వైద్యురాలు కోటేశ్వరమ్మ, న్యాయవాది గిరిజాకుమారి పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని 24వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ పాల్గొని విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లలకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు.
- కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈవో జి.శేషగిరిరావు పాల్గొని మాట్లాడారు. పర్లకొండ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో సూర్యనారాయణ ఫ్యాన్లు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల మైదానాన్ని సొంత ఖర్చులతో చదును చేయించారు. సర్పంచ్ పామూరు కేశవులు, హెచ్‌ఎం కొల్లపనేని శ్రీనివాసులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- పెళ్లకూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి తల్లులు రంగవల్లుల పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. పాఠశాల అభివృద్ధిలో పేరెంట్స్ భాగస్వాములు కావాలని ఎంఈవో శంకరయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, హెచ్‌ఎంలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని బాలురు, పుదూరు బాలికల గురుకుల పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందన్నారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని తనిఖీ చేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు శాంతి, మునిరత్నం, ప్రిన్సిపాళ్లు రూత్‌రమోలా, దాదాపీర్, సీఐ బాబీ తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు : మండలంలోని బాలిరెడ్డిపాళెం, వాకాడు, దుగ్గరాజపట్నం జిల్లా పరిషత్ ఉన్నత, గురుకుల పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొని తల్లిదండ్రులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణారావు పాల్గొన్నారు. అలాగే కల్లూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, గ్రామ సర్పంచి దువ్వూరు భాస్కర్‌రెడ్డి, కాశీపురంలో వైఎస్సార్‌సీపీ నేత రవిరెడ్డి పిల్లలకు బహుమతులు అందజేశారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : చిల్లకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎమ్మెల్సీ బల్లికళ్యాణ చక్రవర్తి పాల్గొని తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను తెలియజేశారు. అలాగే వల్లిపేడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అనంతరం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం : నెలబల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి అధిక లోడుతో వెళ్లే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్, మరో వ్యక్తి గాయపడ్డారు. ఆటో ఎరువు బస్తాలను వేసుకుని నాయుడుపేట నుంచి పెళ్లకూరు మండలం బంగారం పేటకు బయలుదేరింది. నెలబల్లి వద్ద ఆటో స్టీరింగ్ తిరగకపోవడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్ లోకయ్య, ఆటోలో ప్రయాణించే బంగారయ్య గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊటుకూరు చెరువుకు గండి



గండి నుంచి వృథాగా పోతున్న నీరు

సైదాపురం: మండలంలోని ఊటుకూరు గ్రామ సమీపంలోని ఊర చెరువు కట్టకు గండి పడింది. దీంతో నీరు వృథాగా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గండిని పూడ్చాలని కోరుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పనుల గుర్తింపు

చిల్లకూరు : గ్రామ సభలు నిర్వహించి ప్రజల భాగస్వామ్యంతోనే ఉపాధి హామీ కింద చేపట్టే పనులు చేపడుతున్నట్లు ఏపీవో గిరిబాబు తెలిపారు. మండలంలోని మోమిడి, మన్నెగుంట, తమ్మినపట్నం, వరగలి, లింగవరం గ్రామాల్లో శనివారం ఉపాధిపై గ్రామ సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలో సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.